# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం 03 జూన్ 2025 | www.balagamtv.com | పేజీలు 5


## నీట్ పీజీ పరీక్ష వాయిదా

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

దేశవ్యాప్తంగా వైద్య విద్యలో పీజీ ప్రవేశాల కోసం జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించే ఈ ఏడాది నీట్ పీజీ పరీక్ష అనూహ్యంగా వాయిదా పడింది. ఈ మేరకు వైద్యశాస్త్ర పరీక్షల జాతీయ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. నీట్ పీజీ పరీక్ష వాయిదా వేయడానికి గల కారణాలను కూడా బోర్డు వెల్లడించింది. సింగిల్ షిఫ్ట్ లోనే పరీక్ష నిర్వహించాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలే ఈ నిర్ణయానికి కారణమయ్యాయి.నీట్ పీజీ పరీక్ష జూన్ 15న జరగాల్సి ఉంది. అయితే ఎంబీబీఎస్ తో పాటు డెంటల్ కోర్సుల్లో ప్రవేశాలకు రెండు షిఫ్ట్ లకు బదులుగా ఒకే షిఫ్ట్ లో పరీక్ష నిర్వహించాలని దాఖలైన పిటిషన్లను విచారించిన సుప్రీంకోర్టు.. ఈ మేరకు నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ కు ఆదేశాలు ఇచ్చింది. దీంతో ఇప్పటికే ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం సింగిల్ షిఫ్ట్ లో పరీక్ష నిర్వహణ సాధ్యం కాకపోవడంతో బోర్డు కీలక నిర్ణయం ప్రకటించింది.జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న నీట్ పరీక్షల్లో అక్రమాలపై ఇప్పటికే విమర్శలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో పారదర్శకత ఉండాలంటే సింగిల్ షిఫ్ట్ లో పరీక్షలు నిర్వహిచాలని సుప్రీంకోర్టు సూచించింది. అలాగే సురక్షితమైన పరీక్షా కేంద్రాల్ని కూడా ఏర్పాటు చేయాలని ఆదేశించింది. దీంతో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నీట్ పీజీ పరీక్షను ఒకే షిఫ్ట్ లో నిర్వహిస్తామని బోర్డు ప్రకటించింది. ఇందుకు అనుగుణంగానే పీజీ పరీక్షల్ని వాయిదా వేసింది.సుప్రీంకోర్టు నిర్ణయం అమలు చేయాలంటే పలు సర్దుబాట్లు మిగితా 2వ పేజీలో

# 2047 నాటికి ప్రపంచంలోనే తెలంగాణ నంబర్ వన్

- ఆ దిశగా ప్రజా ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేస్తోంది
- ప్రజలు ప్రభుత్వానికి అండగా నిలవాలి
- జీడీపీలో 10 శాతం వాటా
- మూడు ట్రిలియన్ల ఎకానమీ లక్ష్యం
- రాష్ట్రం ఏర్పడి పదేళ్లు గడిచినా ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదు.
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు
- తొమ్మిది మంది ప్రముఖులకు పురస్కారాలు ప్రదానం
- పోలీసు అధికారులకు గ్యాలంటరీ అవార్డులు



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

2047 నాటికి దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే తెలంగాణను నంబర్ వన్ స్థానంలో నిలిపే దిశగా ప్రజా ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ క్రమంలో పారదర్శకమైన పరిపాలనతో తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధిపథంలో నడిపించడానికి ప్రజలందరూ ప్రజా ప్రభుత్వానికి అండగా నిలవాలన్న ఆంకాక్షను వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించి సాయుధ దళాల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమానికి జపాన్ కితాక్యిషఉ మేయర్ కజుహిసా టక్యూచీ రాష్ట్ర అతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి గారు రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.

4 కోట్ల తెలంగాణ ప్రజలకు అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణను అభివృద్ధి పథంవైపు నడిపించడంలో ప్రజా ప్రభుత్వం తీసుకున్న చర్యలు అనుసరిస్తున్న ప్రణాళికలను వివరించారు. "దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి వందేళ్లు పూర్తయ్యే 2047 నాటికి తెలంగాణను అగ్రభాగాన నిలిపేందుకు ప్రయత్నం చేస్తున్నాం. ఆ దిశగానే తెలంగాణ రైజింగ్ 2047 భవిష్యత్తు ప్రణాళికను సిద్ధం చేస్తోంది. వచ్చే పదేళ్లలో 3 ట్రిలియన్ ఎకానమీగా మార్చే లక్ష్యంతో ముందుకు వెళుతున్నాం.

రాష్ట్రం ఏర్పడి పదేళ్లు గడిచినా ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదు. ప్రజా ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే ప్రయత్నాలకు శ్రీకారం చుట్టాం. ప్రజా ప్రభుత్వం బాధ్యతలు చేపట్టే నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తమైంది. వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయి. జరిగిన తప్పిదాలను సరిదిద్దుతూ రాష్ట్రాన్ని గాడిన పెట్టాల్సిన బాధ్యత మాపై ఉంది. ఇది నల్లేరుపై నడక కాదని తెలుసు. అయినా ప్రజల ఆకాంక్షలే ఎజెండాగా తెలంగాణ పునర్నిర్మాణం దిశగా ప్రయత్నిస్తూ ముందుకు కదిలాం. ప్రజల ఆలోచనలే ఆచరణగా ముందుకు వెళుతున్నాం" అని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రజా ప్రభుత్వ లక్ష్య సాధన కోసం ప్రధానంగా మహిళలు, రైతు సంక్షేమం, యువత, విద్య, వైద్య రంగాల్లో ఇప్పటివరకు సాధించిన ప్రగతిని వివరిస్తూ భవిష్యత్తు ప్రణాళికలను ఆవిష్కరించారు.

సామాజిక తెలంగాణ కోసం బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ ఉప కులాల వర్గీకరణ, ఇందిరమ్మ ఇండ్లు, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం వంటి సామాజిక తెలంగాణ నిర్మాణానికి తీసుకున్న నిర్ణయాలను వివరించారు.

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడులకు గమ్యస్థానంగా తెలంగాణను, హైదరాబాద్ ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దడానికి మూసీ పునరుజ్జీవం పథకం, భారత్ ఫ్యూచర్ సిటీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ, మెట్రో రైలు విస్తరణ ప్రణాళికలు, విమానాశ్రయాలు, రీజినల్ రింగ్ రోడ్డు వంటి అంశాలను తెలిపారు. శాంతి భద్రతలు అదుపులో ఉన్నప్పుడే రాష్ట్ర అభివృద్ధి, నిర్దేశిత లక్ష్యాలు సాధ్యమవుతాయని, ఆ లక్ష్యంతోనే పోలీసు యంత్రాంగాన్ని పటిష్టపరచడం, మాదకద్రవ్యాల నియంత్రణకు పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయడం వంటి చర్యల కారణంగా దేశంలోనే తెలంగాణ పోలీసు అగ్రస్థానంలో నిలవడానికి కారణమైన వివరాలను ముఖ్యమంత్రి సవివరంగా తెలిపారు.

హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ వేదికగా మార్చుతూ, ప్రపంచవ్యాప్తంగా వందకుపైగా దేశాల మిగితా 2వ పేజీలో



## గవర్నర్ తేనీటి విందుకు సీఎం రేవంత్ రెడ్డి, మిస్ వరల్డ్ సుందరీమణులు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తేనీటి విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. తాజా ప్రపంచ సుందరి ఓపల్ సుచాత నేతృత్వంలోని సుందరీమణుల బృందం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గవర్నర్ ఇచ్చిన ఈ తేనీటి విందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్), డీజీపీ సహా పలువురు సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్రానికి చెందిన ప్రముఖులు, ఉన్నతాధికారుల కలయికతో రాజ్‌భవన్ ప్రాంగణం సందడిగా మారింది. ఈ వేడుకలో సినీ నిర్మాత దిల్ రాజు దంపతులతో పాటు అంతర్జాతీయ అందాల పోటీల్లో విజేతలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఇటీవల మిస్‌వరల్డ్‌గా కిరీటం గెలుచుకున్న థాయ్‌లాండ్‌కు చెందిన ఓపల్ సుచాత, మొదటి రన్నరప్ ఇథియోపియాకు చెందిన హాసెట్ డెరెజే, రెండో రన్నరప్ పోలాండ్‌కు చెందిన మయా క్లైడా, మూడో రన్నరప్ మార్టినిక్‌కు చెందిన ఆరేలి జోచిమ్ ఈ విందులో పాల్గొన్నారు. వీరంతా రాజ్‌భవన్‌ను సందర్శించి, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిశారు.

రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మిస్ వరల్డ్–2025 విజేత ఓపల్ సుచాత చువాంగ్ శ్రీని సత్కరించారు. జూన్ 02వ తేదీ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం కావడంతో వేడుకలలో పాల్గొనాలని ప్రభుత్వం ఓపల్ సుచాతను అతిథిగా ఆహ్వానించింది. ఓపల్ సుచాత థాయ్‌లాండ్ నుంచి వచ్చి 108 మంది పోటీదారులను దాటి విన్నర్‌గా నెగ్గారు. ప్రపంచ సుందరీ పోటీలు హైదరాబాద్ వేదికగా మే 10వ తేదీ నుంచి 31 వరకు జరిగాయి. తెలంగాణ గురించి వివిధ సందర్భాల్లో మీడియాతో మాట్లాడిన సుచాత చువాంగ్ తెలంగాణ ప్రజల అతిథి మర్యాదలు ఎంతో నచ్చాయని పేర్కొంది. తెలంగాణలోని వివిధ ప్రాంతాలు చాలా ఆకట్టుకున్నాయని, గొప్ప అనుభూతిని ఇచ్చాయని తెలిపింది. రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా వివిధ దేశాలకు చెందిన సుందరీమణులు ప్రత్యేకంగా ఓ వీడియో ద్వారా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజల వద్దకే రెవెన్యూ సేవలు



- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- రెవెన్యూ సదస్సులపై అధికారులతో సమీక్ష

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో గత ప్రభుత్వం స్వార్థం కోసం రెవెన్యూ వ్యవస్థను దుర్వినియోగపరచిన విధానాన్ని, జరిగిన తప్పులను సరిచేసి మొత్తం వ్యవస్థను ప్రక్షాళన చేసి భూ పరిపాలనను ప్రజల వద్దకే తీసుకువెళ్తున్నామని రెవెన్యూ. హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం రెవెన్యూ సదస్సులపై సోమవారం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు కోరిన విధంగా రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా భూభారతి చట్టాన్ని అమలులోకి తీసుకు వచ్చినట్లు చెప్పారు. జూన్ 3వ తేదీ నుంచి 20 వరకు రాష్ట్ర వ్యాప్తంగా భూ భారతి చట్టంలో భాగంగా మిగిలిన అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. అన్నీ రెవెన్యూ గ్రామాలకు తహశీల్దార్ తో కూడిన బృందం వెళుందన్నారు. ప్రజల వద్దకే రెవెన్యూ అనే నినాదంతో భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి పరిష్కరిస్తుందన్నారు.

ఆనాటి ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాల వల్ల రైతులు వారి ప్రమేయం లేకుండానే భూ సమస్యల్లో చిక్కుకున్నారని, సమస్యల గురించి ఎవరిని సంప్రదించాలో తెలియని పరిస్థితి ఉండేదని మంత్రి మిగితా 2వ పేజీలో

## జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు విడుదల..

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఐఐటీ హైదరాబాద్ జోన్ విద్యార్థులు సత్తాచాటారు. కేటగిరీ వారి ర్యాంకుల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులిద్దరు టాపర్లుగా నిలిచారు. ఈడబ్ల్యూఎస్ ఆలిండియా టాపర్‌గా వంగాల అజయ్‌రెడ్డి, ఓబీసీ ఎన్‌సీఎల్ ఆలిండియా టాపర్‌గా డీ. జ్ఞాన రుత్విక్ సాయి నిలిచారు. దేశంలోని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలైన ఐఐటీల్లో బీటెక్ సీట్ల భర్తీకి మే 18న నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలు సోమవారం విడుదలయ్యాయి. మొత్తం 360 మార్కులకు ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లల్లో నిర్వహించిన ఈ పరీక్ష ఫలితాలను ఐఐటీ కాన్పూర్ విడుదల చేసింది.

ఐఐటీ ఢిల్లీ జోన్ విద్యార్థి రజిత్ గుప్తా 332 మార్కులతో ఆలిండియా టాపర్‌గా నిలిచాడు. ఐఐటీ ఖరగ్‌పూర్ జోన్ విద్యార్థి దేవదత్ మాజీ ఆలిండియా మహిళా టాపర్‌గా నిలిచాడు. ఐఐటీ హైదరాబాద్ జోన్ విద్యార్థి అర్నవ్ సింగ్ 319 మార్కులతో ఆలిండియా 9వ ర్యాంకుతో పాటు హైదరాబాద్ జోన్ టాపర్‌గా నిలిచాడు. ఇదే జోన్ విద్యార్థి వడ్లమూడి లోకేష్ 317 మార్కులలో ఆలిండియా 10వ ర్యాంకును కైవసం చేసుకున్నాడు. అనిరుద్‌రెడ్డి ఆలిండియా 20, కే రసజ్ఞ హైదరాబాద్ జోన్ మహిళా టాపర్‌తోపాటు, ఆలిండియా 78వ ర్యాంకును సొంతం చేసుకున్నారు. మిగితా 2వ పేజీలో

## 11న కాళేశ్వరం కమిషన్ విచారణకు కేసీఆర్

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో



మాజీ సీఎం కేసీఆర్ కీలక నిర్ణయాన్ని తీసుకున్నారు. ఈనెల 5వ తేదీన కాళేశ్వరం కమిషన్ విచారణకు కేసిఆర్ వెళ్లాల్సి ఉండగా ఆ తేదీని వాయిదా వేసుకున్నారు. ఈనెల 11వ తేదీన విచారణకు హాజరు అవుతానని చెప్పారు. ఈ విషయాన్ని కెసిఆర్ తెలియజేయగా దానికి కమిషన్ అంగీకరించింది. ఈ నేపథ్యంలోనే కేసీఆర్ ఇప్పటికే పలుమార్లు పార్టీ నాయకులతో అంతర్గతంగా మంతనాలు జరిపినట్టు సమాచారం.

కాగా కేసీఆర్‌కు ముందే మాజీ మంత్రి హరీశ్‌రావు కమిషన్ ఎదుటకు రానున్నారు. ఇక హరీశ్‌రావు మీడియాకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చేందుకు ప్రయత్నాలు చేశారు. అయితే దాన్ని వాయిదా వేశారు. విచారణకు ముందు ప్రజెంటేషన్ ఇస్తారా ? తర్వాత ఇస్తారా ? అనే అంశం తేలాల్సి ఉంది. అయితే అనుమతి ఇస్తే కమిషన్‌కు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వడం ద్వారా తన వాదనలను బలంగా వినిపించాలని హరీశ్‌రావు భావిస్తున్నట్టు సమాచారం.

## తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌తో ముందుకు..



- ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణను దేశంలోనే కాదు, ప్రపంచంలోనే అగ్రస్థానానికి తీసుకెళ్లేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్ 2047 విజన్ తో ప్రజాపాలన ముందుకు సాగుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు.ఖమ్మంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణాలు అర్పించిన అమర వీరులకు నివాళులర్పించారు. జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ కుల మతాల కతీతంగా విద్యార్థులకు విద్యను అందిస్తున్నామని చెప్పారు. రెవెన్యూ శాఖను పటిష్టం చేసేందుకు చర్యలు చేపట్టామని, ఇందులో భాగంగా ప్రతి గ్రామానికి పరిపాలన అధికారిని నియమిస్తున్నామని భట్టి తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. మన ఆడబిడ్డల ప్రయాణ ఖర్చులు ఆలోచించి వారి ప్రయాణ ఖర్చులు ఉచితం చేశామని గుర్తు చేశారు. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల విద్యుత్ వినియోగిస్తున్న వారికి ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, నిరాశ్రయులైన పేదలకు ఇందిరమ్మ ఇళు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్ల కేటాయించిందన్నారు. రైతులకు రుణ మాఫీ చేసి రైతులు తిరిగి రుణ మాఫీ పొందడానికి మార్గం సుగమం చేశామన్నారు. ప్రస్తుత యాసంగికి బోనస్ చెల్లించనున్నామని చెప్పారు.

మద్దులపల్లిలో 20 కోట్ల రూపాయలు ఖర్చు చేసి మార్కెట్ యార్డ్ నిర్మించుకుంటున్నామన్నారు. ఇందిరా మహిళ శక్తి కింద మహిళా మార్ట్, మిగితా 2వ పేజీలో

## దేశ పురోగతికి తెలంగాణ అవిరళ కృషి

- ప్రధాని నరేంద్ర మోడీ

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

దేశ పురోగతికి తెలంగాణ అవిరళ కృషి చేస్తున్నదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన రాష్ట్ర ప్రజలకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా తెలుగులో ట్వీట్ చేశారు. రాష్ట్ర ప్రజలకు విజయాలు, సంపదలు కలిగేలా ఆశీర్వాదాలు లభించాలని అన్నారు.

## పొజీషన్ లో ఉన్నా.. అపొజిషన్ లో ఉన్నా తెలంగాణే ఫస్ట్

- మళ్లీ మూడేళ్లలో కేసిఆర్ ముఖ్యమంత్రి
- ఎన్నారై అంటే నెసెసరీ రెసిడెంట్ ఆఫ్ ఇండియా.
- తెలంగాణలో పెట్టుబడులు పెట్టి మాతృ భూమి రుణం తీర్చుకోండి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- డల్లాస్ లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ, బీఆర్ఎస్ రజతోత్సవ సంబురాలు



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

పొజీషన్ లో ఉన్నా.. అపొజిషన్ లో ఉన్నా తమకు తెలంగాణే ఫస్ట్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.తారకరామారావు అన్నారు. 14 ఏళ్ల అలుపెరగని పోరాటంతో సాధించిన తెలంగాణ రాష్ట్రం, ఉద్యమ రథసారథి కేసీఆర్ గారి పాలనలో కేవలం పదేళ్ల వ్యవధిలోనే దేశంలోనే నెంబర్ వన్ స్టేట్ గా ఎదిగిందన్నారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో మోస్ట్ సక్సెస్ ఫుల్ స్టార్టప్ స్టేట్ గా తెలంగాణ నిలిచిందని, ఇంత అమోఘమైన అభివృద్ధిని సాధించిన రాష్ట్రం దేశంలోనే మరొకటి లేదన్నారు. తెలంగాణను అద్భుత అవకాశాల అక్షయపాత్ర గా, ఇండియాకే ఎకనామిక్ ఇంజన్ గా తీర్చిదిద్దిన ఘనత ముమ్మాటికీ కేసీఆర్ గారికే దక్కిందన్నారు. అమెరికాలోని డల్లాస్ లో ఉన్న డాక్టర్ పెప్పర్ ఎరీనాలో అత్యంత ఘనంగా నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, బీఆర్ఎస్ రజతోత్సవ సంబురాల్లో కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జననీ జన్మభూమిశ్చా స్వర్గాదపీ గరీయసీ అంటూ తన ప్రసంగాన్ని మొదలుపెట్టిన కేటీఆర్, కర్మభూమి మీద కార్యదక్షులై వర్ధిల్లండి. కానీ జన్మభూమి రుణం కూడా తీర్చుకోవాలని ఎన్.ఆర్.ఐలకు పిలుపునిచ్చారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టమని విజ్ఞప్తి చేశారు. సంకల్పం, పట్టుదల, చిత్తశుద్ధి ఉంటే సాధించలేనిది ఏదీ లేదని తెలంగాణ రాష్ట్రం దేశానికి చాటిచెప్పిందని సగర్వంగా ప్రకటించారు. 14 ఏళ్ల ఉద్యమ ప్రస్థానంలో, 10 ఏళ్ల తెలంగాణ ఉజ్వల ప్రయాణంలో, అడుగడుగునా కేసీఆర్ గారు వేసిన చారిత్రక ముద్రను అమెరికాలోని అనేక రాష్ట్రాల నుంచి వేలాది గా తరలివచ్చిన ఎన్.ఆర్.ఐ.ల హర్షధ్వానాల మధ్య కేటీఆర్ వివరించారు.

సమైక్యపాలకుల వివక్షతో దశాబ్దాలపాటు పడావుబడ్డ తెలంగాణ దీనస్థితిని, కేసీఆర్ గారి హయాంలో పదేళ్లలోనే సుజల, సుఫల, సస్యశ్యామల తెలంగాణగా ఎదిగిన తీరును కేటీఆర్ అద్భుతంగా ఆవిష్కరించారు. ట్రంప్ విధానాలతో ఇబ్బందులు పడుతున్న తెలుగు విద్యార్థులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. అమెరికాలో లీగల్ సెల్ ఏర్పాటుచేసి తెలుగు విద్యార్థులను అన్నివిధాలా ఆదుకుంటామని కేటీఆర్ భరోసా ఇచ్చారు.

"దశాబ్ది ఉత్సవాల నాడు తెలంగాణ గడ్డమీద ఎలాంటి ఉత్సాహం కనిపించిందో ఇవాళ డల్లాస్ లో కూడా అదే జోష్ కనిపిస్తుంది. ఇవాళ జరుగుతున్నది ఒక వేడుక మాత్రమే కాదు.. అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం సర్వస్వాన్ని ధారపోసిన ప్రతి ఒక్కరి గురించి మాట్లాడుకునే సందర్భం ఇది. అభివృద్ధి, ఆత్మ గౌరవం, తెలంగాణ అస్తిత్వ లక్ష్యాల సాధన కోసం 20 సంవత్సరాల క్రితం ఒక మిగితా 5వ పేజీలో



## ఈశాన్య రాష్ట్రాల్లో కుంభవృష్టి..

- 34 మంది మృతి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఈశాన్య రాష్ట్రాల్లో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. సిక్కిం, అస్సాం, మణిపూర్, అరుణాచల్ ప్రదేశ్, త్రిపుర, మిజోరాం, నాగాల్యాండ్, మేఘాలయలో గత నాలుగు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ కుంభవృష్టి కారణంగా ఎక్కడికక్కడ కొండచరియలు విరిగిపడుతున్నాయి. కొన్ని చోట్ల వరదలు పోటెత్తుతున్నాయి . వరద ప్రవాహానికి రోడ్లు, వంతెనలు కొట్టుకుపోయాయి. పలు చోట్ల ఇళ్ల ధ్వంసమయ్యాయి. చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. ఈ వర్షాలకు జనజీవనం స్తంభించిపోయింది. వర్షాల కారణంగా సంభవించిన ఘటనల్లో అనేక మంది మిగితా 2వ పేజీలో

## అవినీతిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పోటీ

- తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

అవినీతిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు పోటీ పడుతున్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్రమంత్రి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ రెండు పార్టీలు తెలంగాణను నిలువునా దోపిడీ చేస్తున్నాయని, ప్రజలు తెలంగాణను రక్షించుకునేందుకు సన్నద్ధం కావాలని అన్నారు. తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. తెలంగాణ అభివృద్ధికి అంకతభావంతో పనిచేస్తామని, ప్రజలకు ఇచ్చిన మాటమీద నిలబడుతామని చెప్పారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్ పీడను వదిలించుకొని, ప్రజలు మరో పీడను తగిలించుకున్నారని కిషన్ రెడ్డి తెలిపారు. అవినీతి దోపిడీ పార్టీల నుంచి తెలంగాణను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి తెలంగాణ పౌరుడి మీద ఉందని చెప్పారు. తెలంగాణ పోరాటం ప్రపంచ చరిత్రలో లిఖించదగ్గ పోరాటమని కిషన్ రెడ్డి అన్నారు. తెలంగాణ సాధన కోసం బలిదానం చేసుకున్నారని తెలిపారు. తెలంగాణ కోసం చిత్తశుద్ధితో పోరాటం చేసిన పార్టీ ఏకైక పార్టీ బీజేపీ అని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో బీజేపీ కీలక పాత్ర పోషించిందని చెప్పారు. పార్లమెంట్ ఉభయ సభల్లో తెలంగాణ కోసం గొంతెత్తిన పార్టీ బీజేపీ అని అన్నారు. తెలంగాణ ఆవిర్భావం తరువాత నీళ్ల పేరుతో, నిధుల పేరుతో, నియామకాల పేరుతో దోపిడి జరిగిందని తెలిపారు. తెలంగాణ ఆకాంక్షల మేరకు బీఆర్ఎస్ పనిచేయలేదని అన్నారు. 11 ఏళ్ల తరువాత తెలంగాణ ఏ విధంగా ఉందో ప్రజలు ఆత్మవిమర్శ చేసుకోవాలని చెప్పారు. అప్పట్లో కేసీఆర్ బంగారు తెలంగాణ చేస్తామన్నారని, పదేళ్ల తర్వాత కేసీఆర్ కుటుంబం మాత్రమే బంగారు తెలంగాణ అయ్యిందని ఎద్దేవా చేశారు.

## 2047 నాటికి ప్రపంచంలోనే తెలంగాణ నంబర్ వన్

(మొదటి పేజీ తరువాయి)

నుంచి దాదాపు 450 మంది ప్రతినిధులు హాజరైన భారత్ సమ్మిట్ నిర్వహణ, తెలంగాణ జరూర్ ఆనా నినాదంతో మన సంస్కృతి, చారిత్రక వైభవాన్ని ప్రపంచానికి చాటాలన్న లక్ష్యంతో 72 వ మిస్ వరల్డ్ పోటీల నిర్వహణ వంటి అంశాలను చెప్పారు. దేశ రక్షణ, సమగ్రత విషయంలో రాజకీయాలకు అతీతంగా కేంద్రానికి మద్దతుగా తెలంగాణ నిలిచింది. పహల్గామ్ దాడుల ఘటనలో భారత సైన్యానికి, కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ మద్దతుగా నిలిచిన అంశాన్ని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన తొమ్మిది మంది ప్రముఖులకు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పురస్కారాలను అందించారు. అలాగే, వివిధ కేటగిరీల్లో విశేష ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులకు గ్యాలంటరీ అవార్డులను అందించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు గారు, డీజీపీ జితేందర్ గారు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**9 మందికి ఒక్కొక్కరికి కోటి రూపాయలు..**

తెలంగాణ ఉద్యమంలో ప్రజల గుండెల్లో నిలిచిన కవులు, కళాకారులు, సాహితీవేత్తలు తొమ్మిది మందికి కోటి రూపాయల చొప్పున నగదు పురస్కారం అందిస్తామని తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ రోజున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ మాట నిలబెట్టుకున్నారు. సికింద్రాబాద్‌లోని పెరేడ్ గ్రౌండ్‌లో రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రావతరణ వేడుకలు సందర్భంగా ఆ తొమ్మిది మందికి రేవంత్ రెడ్డి నగదు పురస్కారం అందించారు. ఎక్కా యాదగిరి రావు, అందె శ్రీ, సుద్దాల అశోక్ తేజ, జయరాజు, పాశం యాదగిరికి నగదు పురస్కారాన్ని ఇచ్చారు. దివంగత గూడ అంజయ్య, గద్దర్, బండి యాదగిరి నగదు పురస్కారాన్ని వారి కుటుంబ సభ్యులు అందుకున్నారు. అలాగే, విదేశీ పర్యటనలో ఉన్న గోరటి వెంకన్న తరఫున ఆయన కూతురు పురస్కారాన్ని అందుకున్నారు. మరోవైపు, ఉత్తమ ప్రతిభ కనబర్చిన 19 మంది పోలీస్ అధికారులకు మెడల్ ఫర్ గ్యాలంట్రీ ,11 మంది కి మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్ అవార్డులను సీఎం అందించారు. బహు బాషా సాహితీ వేత్త నలిమెల భాస్కర్ కు కాళోజీ పురస్కారాన్ని ప్రదానం చేశారు.

# రాష్ట్ర పురోభివృద్ధిని ముందుకు తీసుకెళుతున్నాం




**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణ భవిష్యత్తు కోసం కొత్తగా ప్రపంచ భాగస్వామ్యాలతో వివిధ ప్రాజెక్టులు చేపట్టి రాష్ట్ర పురోభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళుతున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుక సందర్భంగా హైదరాబాద్‌కు వచ్చిన కిటాక్యూషు నగర మేయర్ కజుహిసా టెక్యూచి నేతృత్వంలోని ప్రతినిధి బృందంతో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు.

ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్ వంటి రంగాల్లో కిటాక్యూషు సహకారం కోసం ముఖ్యమంత్రి గారి సమక్షంలో తెలంగాణ ప్రభుత్వం అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశాయి. గత ఏప్రిల్‌లో జపాన్ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి గారు కిటాక్యూషు నగరాన్ని సందర్శించిన సందర్భంగా ఆ నగర మేయర్ కజుహిసా టెక్యూచి గారితో సమావేశమైనప్పుడు పర్యావరణ పరిరక్షణకు సంబంధించి పలు సంస్థలతో లెటర్స్ ఆఫ్ ఇంటెంట్ కుదుర్చుకున్నారు. తాజాగా జరిగిన భేటీలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న కిటాక్యూషు ప్రతినిధి బృందానికి స్వాగతం. జపాన్ పర్యటన సందర్భంగా కిటాక్యూషు నగర ఎకో-టౌన్ మాడల్‌తో చాలా ప్రేరణ పొందాను. మీరిచ్చిన ప్రేరణతోనే తెలంగాణ ప్రభుత్వం అలాంటి నమూనాను హైదరాబాద్‌లో అభివృద్ధి చేయడం కోసం అనేక సంస్థలతో అవగాహన ఒప్పందాలపై సంతకం చేసింది. సమ్మిళిత ఆర్థిక వ్యవస్థ, సున్నా ఉద్గారాలు, పట్టణ ఆవిష్కరణలలో ఈ సహకారం పునాది కానుంది.

మూసీ నది అభివృద్ధి, పునరుజ్జీవన ప్రాజెక్టుపైన ప్రభుత్వం దృష్టి సారించింది. తెలంగాణ యువతకు నైపుణ్యం కల్పించడం ప్రభుత్వ ప్రాధాన్యత. జపాన్ లో అవకాశాలను అన్వేషించాలన్న అభిలాషతో ఇక్కడి విద్యార్థులు జపనీస్ భాషను నేర్చుకోవాలని అనుకుంటున్నారు. మీ సహకారంతో ఔత్సాహికులకు జపనీస్ నేర్పించాలని భావిస్తున్నాం. హైదరాబాద్ నుంచి నేరుగా కిటాక్యూషు మధ్య విమాన కనెక్టివిటీ కోసం ప్రయత్నం చేస్తున్నాం. కిటాక్యూషు నగర నాయకత్వాన్ని అభినందిస్తున్నాను. కిటాక్యూషు నగర అభివృద్ధి తెలంగాణ రైజింగ్‌కు సరిపోయేలా ఉంది. రెండింటి మధ్య స్నేహం సుదీర్ఘ కాలం కొనసాగాలని కోరుకుంటున్నాను" అని ముఖ్యమంత్రి గారు అన్నారు. ఈ సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గారితో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నీట్ పీజీ పరీక్ష వాయిదా

(మొదటి పేజీ తరువాయి)

చేయాల్సి ఉంటుందని బోర్డు ఓ ప్రకటనలో తెలిపింది. ఇందులో ముఖ్యంగా పరీక్షా కేంద్రాల సంఖ్యను పెంచడం, అభ్యర్థులందరికీ ఒకేసారి వసతి కల్పించడానికి మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం వంటి అంశాలున్నట్లు పేర్కొంది. కాబట్టి ఆ మేరకు ఏర్పాట్లు చేసుకునేందుకు వీలుగా పరీక్షలు వాయిదా వేసినట్లు తెలిపింది. త్వరలోనే నీట్ పీజీ పరీక్షల కొత్త తేదీ వెల్లడిస్తామని పేర్కొంది

## జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు విడుదల..

(మొదటి పేజీ తరువాయి)

**హైదరాబాద్ జోన్ నుంచి టాపర్లు**

అర్నవ్ సింగ్- 09 (ఆలిండియా ర్యాంకు)
వడ్లమూడి లోకేష్- 10
డీ. జ్ఞాన రుత్విక్ సాయి- 18
వంగాల అజయ్‌రెడ్డి- 19
ఏ. అనిరుద్‌రెడ్డి- 20
కే. రసజ్ఞ- 78

ఈ సారి జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు 1.87లక్షల మంది దరఖాస్తు చేసుకోగా, 1.80లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. వీరిలో 54,378 మంది క్వాలిఫై అయ్యారు. క్వాలిఫై అయిన వారిలో అబ్బాయిలే అధికంగా ఉన్నారు. 44వేల మంది అబ్బాయిలు క్వాలిఫై అయితే, అమ్మాయిలు కేవలం 9,404 మంది మాత్రమే అర్హత సాధించారు. అయితే ఐఐటీ హైదరాబాద్ జోన్ నుంచి రికార్డుస్థాయిలో విద్యార్థులు క్వాలిఫై అయ్యారు. మొత్తం ఏడు జోన్లు ఉండగా, హైదరాబాద్ జోన్ నుంఇ ఈ సారి రికార్డుస్థాయిలో 12,946 మంది విద్యార్థులు క్వాలిఫై అయ్యారు. ఐఐటీ హైదరాబాద్ జోన్ పరిధిలో తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాలున్నాయి. అడ్వాన్స్‌డ్‌లో టాప్ 10, టాప్ 100లోను మనోళ్లు సత్తాచాటారు. మిగతా జోన్లతో పోల్చితే మన దగ్గరి నుంచే టాప్ -500లో అత్యధికులు నిలిచారు. టాప్ 10లో ఐఐటీ హైదరాబాద్ జోన్ నుంచి ఇద్దరు విద్యార్థులున్నారు. టాప్ 100లో 23 మంది, టాప్ 200లో 57 మంది ఐఐటీ హైదరాబాద్ జోన్ విద్యార్థులే కావడం గమనార్హం. టాప్ 300లో 78 మంది, టాప్ 400లో 116, టాప్ 500లో 136 ఐఐటీ హైదరాబాద్ జోన్ విద్యార్థులున్నారు.

## ఈశాన్య రాష్ట్రాల్లో కుంభవృష్టి..

(మొదటి పేజీ తరువాయి)

ప్రాణాలు కోల్పోయారు. వరదలు, కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో కనీసం 34 మంది మరణించారు. వేల సంఖ్యలో ప్రజలు నిరాశ్రయులయ్యారు. వారంతా ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్నారు. ఎన్డీఆర్ఎఫ్, ఐఏఎఫ్ దళాలు ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపడుతున్నారు. వరదల్లో చిక్కుకుపోయిన వారిని పడవల సాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

ఇదిలా ఉండగా.. కేంద్ర హోం మంత్రి అమిత్ షా అస్సాం, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ఫోన్‌లో మాట్లాడారు. ఆయా రాష్ట్రాల్లో వరద పరిస్థితులపై ఆరా తీశారు. సహాయక చర్యల విషయంలో కేంద్రం నుంచి సంపూర్ణ సహకారం అందిస్తామని భరోసా కల్పించారు. మరోవైపు ఈశాన్య రాష్ట్రాల్లో జూన్ 4 వరకూ ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది.

# ప్రజల వద్దకే రెవెన్యూ సేవలు

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. ఏ సమస్యకైనా కోర్టు మెట్లు ఎక్కవలసిందేనని, కానీ ఈనాడు ఈ ఇందిరమ్మ ప్రభుత్వం వారి వద్దకే వెళ్లి ఎలాంటి రుసుము లేకుండా ఉచితంగానే వారి సమస్యలను పరిష్కరిస్తుందన్నారు. ఇప్పటికే ఈ దిశగా ప్రభుత్వం చేపట్టిన చర్యలు విజయవంతమయ్యాయని అన్నారు. మొదటగా నాలుగు పైలట్ మండలాల్లో 72 రెవెన్యూ గ్రామాలలో నిర్వహించిన సదస్సుల్లో 13 వేలకు పైగా దరఖాస్తులు రెండో విడతలో 28 మండలలో 421 రెవెన్యూ గ్రామాలల్లో నిర్వహించిన సదస్సుల్లో 42 వేల దరఖాస్తులు వచ్చాయని, వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేసి ఇప్పటి వరకు 60 శాతం వరకు భూ సమస్యలు పరిష్కరించడం జరిగిందని అన్నారు. అధికంగా సాదా బైనామాలకు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయని, ఈ అంశం కోర్టు పరిధిలో ఉందని, దీనికి త్వరలో పరిష్కారం చూపిస్తామని తెలిపారు. ప్రభుత్వానికి ప్రజలకు రెవెన్యూ శాఖ వారధిగా ఉంటుందని, ఈ విభాగం సమర్ధవంతంగా పనిచేసినప్పుడే ప్రభుత్వం నిర్ధేశించిన లక్ష్యాలు ఆకాంక్షలు నెరవేరి ప్రభుత్వం కోరుకున్న ఫలితాలు లభిస్తాయని పొంగులేటి అన్నారు. ప్రజలు కోరుకుంటున్న దిశలో రెవెన్యూ వ్యవస్థ పనిచేయాలన్నారు. గత ప్రభుత్వంలో కొందరికే పరిమితమైన రెవెన్యూ సేవలు గ్రామ స్థాయిలో అందించడానికి తమ ప్రభుత్వం కృత నిశ్చయంతో ముందుకు వెళ్తుందన్నారు. ముఖ్యంగా కలెక్టర్లు మానవీయ కోణంలో భూ సమస్యలు పరిష్కరించాలని, ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటించి భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఈ రెవెన్యూ సదస్సుల్లో భాగంగా ప్రజల వద్దకు వెళ్లే రెవెన్యూ యంత్రాంగం మానవతా దృక్పథంతో వ్యవహరించి ప్రజలతో మమేకం కావాలని, వీలైనంతవరకూ వారి సమస్య పరిష్కారం చేసేలా వ్యవహరించాలన్నారు.

# తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌తో ముందుకు..

(మొదటి పేజీ తరువాయి)

మహిళ క్యాంటీన్ లు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్వయం సహాయక సభ్యులతో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు ఏర్పాటు చేశామని చెప్పారు. గురుకులాల్లో చదివే విద్యార్థుల కు 40 శాతం డైట్, కాస్మొటిక్ చార్జీలు పెంచామని తెలిపారు. వంద ఎంబీబిఎస్ సీట్ల సామర్థ్యం కలిగిన మెడికల్ కాలేజీలను రూ.130 కోట్లతో నిర్మించామన్నారు. రూ.20 కోట్ల నిధులతో రోడ్డు ప్రమాద ఘటనలో చికిత్స అందించేందుకు అత్యవసర విభాగాలు నిర్మించామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులతో పాటు మైనార్టీ విద్యార్థులకు పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ అందిస్తున్నామని చెప్పారు.

ఖమ్మం నగరం చుట్టూ జాతీయ రహదారులు రానున్నాయి, రింగ్ రోడ్డుకు చర్యలు చేపట్టామని భట్టి చెప్పారు. మున్నేరు నది పై తీగల వంతెన నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. అన్ని గ్రామ పంచాయతీలలో వైకుంఠ ధామం నిర్మించామన్నారు. అక్రమంగా గనులు తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసి, 825 కేసులు నమోదు చేసి కోటి 36 లక్షల జరిమాన విధించడం జరిగిందని తెలిపారు. కొత్తగా కల్లూరు పట్టణాన్ని మున్సిపాలిటీ గా ఏర్పాటు చేశామన్నారు. సర్దార్ పటేల్ స్టేడియం లో 8 కోట్ల 50 లక్షలతో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ ఏర్పాటు చేశామని, సీఎం కప్ పోటీలకు ఖమ్మం జిల్లా నుండి 382 మంది క్రీడాకారులు పాల్గొని 20 బంగారు పతకాలు, 12 వెండి, 15 కాంస్య పతకాలు సాధించారని అన్నారు. భూ తాపాన్ని తగ్గించడానికి ప్రభుత్వం వన మహోత్సవం ప్రారంభించిందని, 2024-25 సంవత్సరానికి గాను 31 లక్షల మొక్కలు నాటే లక్ష్యంతో ఇప్పటికే 34 లక్షల మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామని చెప్పారు.

## నన్ను సస్పెండ్ చేస్తే.. అందరి జాతకాలు బయటపెడ్తా..

### ఎమ్మెల్యే రాజాసింగ్ వార్నింగ్



**బలగం టీవి, హైదరాబాద్**

తనను సస్పెండ్ చేస్తే అందరి జాతకాలు బయటపెడతానని బీజేపీ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ రాష్ట్ర నాయకత్వానికి వార్నింగ్ ఇవ్వడం సంచలనంగా మారింది. సోమవారం రాజాసింగ్ ఓ ప్రకటన విడుదల చేశారు. తనకు పార్టీ నోటీసులు ఇవ్వాలని యోచిస్తున్నట్టు ప్రచారం సాగుతున్నదని.. నోటీసులు కాదు.. కావాలంటే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని రాజాసింగ్ డిమాండ్ చేశారు. అందని జాతకాలు బయటపెడ్తానని.. ఎవరి వల్ల పార్టీకి నష్టం జరిగిందనేది ప్రజల ముందుంచి తాను బయటకు వెళ్తానని.. సొంత పార్టీ నేతలను ఆయన హెచ్చరించారు. బీజేపీలో రాష్ట్ర నాయకత్వం వర్సెస్ రాజాసింగ్ వివాదం మరింత ముదురుతున్న వేళ.. ఆయన తాజా ప్రకటన కాషాయపార్టీలో మరోసారి కలకలం రేపింది.

## కోనరావుపేట సింగిల్ విండో ద్వారా రైతులకు రూ. 29 లక్షల రుణాలు పంపిణీ..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

కోనరావుపేట మండలంలోని సింగిల్ విండో కార్యాలయంలో ఈరోజు కర్షక మిత్ర స్కీం కింద రైతులకు రూ. 29 లక్షల దీర్ఘకాలిక (ఎల్.టి.) రుణాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని సింగిల్ విండో చైర్మన్ బండ నరసయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా రుణాలు పొందిన రైతులు తోట్ల లింబయ్య (మరిమడ్ల): రూ. 6 లక్షలు, బైరి సాయికుమార్ (మరిమడ్ల): రూ. 5 లక్షలు, తొట్ల లింగవ్వ (మరిమడ్ల): రూ. 4 లక్షలు, లావుడియా రాంజీ బాహు (సాయిపేట): రూ. 4 లక్షలు, తిప్పారం బ్రహ్మయ్య (అడవిపదిరే): రూ. 10 లక్షలు. ఈ సందర్భంగా చైర్మన్ బండ నరసయ్య మాట్లాడుతూ, కోనరావుపేట సింగిల్ విండో గత ఐదు సంవత్సరాలుగా ఎల్.టి. లోన్‌లు, గ్రాఫ్ లోన్‌లు, గొర్రెలు, బర్రెలు కొనుగోలుకు ఇతరత్రా అన్ని రకాల రుణాలను రైతులకు అందిస్తోందని తెలిపారు. రైతుల అవసరాలను అన్నివేళలా తీరుస్తున్నామని పేర్కొన్నారు.



## రాజన్న ఆలయాన్ని మూసివేయడం లేదు..

**-రాజన్న ఆలయ విస్తరణ పై త్వరలో పవర్ పాయింట్ ప్రదర్శన..**

**-ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, వేములవాడ**

రాజన్న ఆలయాన్ని మూసివేయమని..,దీనిపై ఎలాంటి అసత్య ప్రచారాలు చేయవద్దని, స్వామి వారికి నిత్య పూజలు కొనసాగుతాయని,ఆలయంలో పనులు చేపట్టనున్న దృష్యా భక్తులకు భీమేశ్వరాలయంలో దర్శనానికి ఏర్పాటు చేస్తున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం వేములవాడ రాజన్న ఆలయ విస్తరణ, భీమేశ్వరాలయంలో ఏర్పాట్లపై ఆలయ గెస్ట్ హౌస్ లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, దేవాదాయ శాఖ కమిషనర్ వెంకట్రావు,వీటీడీఏ వైస్ చైర్మన్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ ముఖ్య అతిథిలు గా హాజరయ్యారు. అనంతరం ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూరాజన్న ఆలయ విస్తరణపై భక్తులు, వేములవాడ వాసులు, ప్రముఖులు, పండితులు అందరికీ త్వరలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పిస్తామని,రూ. 76 కోట్లతో ఆలయ విస్తరణ పనులకు త్వరలో టెండర్లు పిలుస్తామని అన్నారు... భీమేశ్వరాలయంలో నిత్య కల్యాణం షెడ్లు, భక్తుల దర్శనం క్యూలైన్లు, కోడెమొక్కుల క్యూ లైన్లు, ఆలయ ఆవరణలో షెడ్లు తదితరుల మౌలిక వసతులు వంటి మొత్తం 8 పలు అభివృద్ధి పనులకు త్వరలో టెండర్లు పిలుస్తామని అన్నారు. విశాలమైన స్థలం, ఆధునిక సౌకర్యాలతో గోశాలలు నిర్మించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించగా, స్థానికంగా స్థలం గుర్తించాలని అన్నారు.

రాజన్న ఆలయ సమీపంలో కిలోమీటర్ పరిధిలో పెద్ద పెద్ద భవనాలు నిర్మించవద్దని గతంలో జారీ చేసిన జీవో ను 100 మీటర్లకు కుదించాలని చర్చించి సదరు జి ఓ సవరణ ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి సమర్పించాలని అన్నారు..

**కోడెల పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి..**

రాజన్న ఆలయానికి సంబంధించిన గోశాల లోని కోడెల సంరక్షణ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని దేవాదాయ శాఖ కమిషనర్ అధికారులను ఆదేశించారు ఈ సందర్భంగా గోశాల ఆవరణ కోడెలను కలెక్టర్ తో కలిసి పరిశీలించి అధికారులకు పలు సూచనలు సలహాలు అందజేశారు. కోడలకు పచ్చి గడ్డి ఇవ్వాలని నాణ్యమైన దాన పెట్టాలని క్రమం తప్పకుండా వైద్య శిబిరాలు నిర్వహించి కావాల్సిన మందులు అందజేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్థపతి వల్లి నాయగన్, ఈఓ వినోద్, ఈఈ రాజేశ్, డీఈ రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.



## 17వ పోలీస్ బెటాలియన్ లో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు..

**బలగం టీవీ, సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా అర్బన్ పరిధిలోని సర్దాపూర్‌లో 17వ పోలీస్ బెటాలియన్ లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బెటాలియన్ కమాండెంట్ ఎం.ఐ. సురేష్ జాతీయ జెండా ఎగురవేసి,పోలీసఅధికారులకు మరియు పోలీస్ సిబ్బందికి తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బెటాలియన్ కమాండెంట్ శ్రీ ఎం.ఐ. సురేష్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు కన్న కలలు సాకారం అయిన రోజు అని,ఎంతో మంది తెలంగాణ అమరవీరుల త్యాగఫలంతో, ఉద్యమకారుల పోరాటంతో 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని అన్నారు. నీళ్లు, నిధులు, నియమాకాల నినాదంతో దేశంలో 29వ రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని,1969లో తొలిదశ ఉద్యమం తీవ్రస్థాయికి చేరిందని అన్నారు.ఓయూలో విద్యార్థుల పోరాటం, కొందరు ఉద్యమకారుల మరణంతో ఉద్యమం ఉవ్వెత్తున పైకి లేచిందని అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు గురించి గొంతెత్తి నినాదించారని, ఈ సమయంలోనే 2001 లో కేసీఆర్ డిప్యూటీ స్పీకర్ పదవీకి రాజీనామా చేసి, మలిదశ తెలంగాణ ఉద్యమానికి అంకురార్పణ చేసారని అన్నారు.జయశంకర్ సార్, కొండ లక్ష్మణ్ బాపూజీ, లాంటి మహా వ్యక్తులు తెలంగాణ రాష్ట్రం కోసం కృషి చేశారని,వారి కృషి ఫలితంగా తెలంగాణా రాష్ట్రం ఏర్పడిందనిఅన్నారు. ఈ సందర్భంగా విధులలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీమతి ప్రమీల, అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## కోనరావుపేట ట్రాక్టర్ యూనియన్ ఎన్నిక..

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల**



కోనరావుపేట గ్రామంలో ట్రాక్టర్ యూనియన్ అధ్యక్షునిగా దండు మహిపాల్ ని ఎన్నుకోవడం జరిగింది. ఉపాధ్యక్షుడిగాకొలకాని నాగరాజు ప్రధాన కార్యదర్శిగా రాస రవీందర్ రెడ్డి సెక్రటరీ దూర్ల నారాయణ, క్యాషియర్‌గా మందల సంజీవ్, పాక మహేష్ ఎనినకయ్యారు. ట్రాక్టర్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు

# ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

**- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల**



తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను జిల్లా పోలీస్ భవన్ సమీపంలోని పరేడ్ గ్రౌండ్ లో సోమవారం నిర్వహించగా, ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. ముందుగా సిరిసిల్లలోని పాత బస్ స్టాండ్ సమీపంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ, ఎస్పీ మహేష్ బి గితే తదితరులతో కలిసి నివాళులర్పించారు. అనంతరం పరేడ్ గ్రౌండ్లో జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జిల్లాలోని 110 స్వశక్తి సంఘాలకు 102 కోట్ల 45 లక్షల బ్యాంక్ లింకేజీ రుణాలను పంపిణీ చేశారు. ప్రొఫెసర్ జయ శంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి ఆద్వర్యంలో ప్రతి గ్రామానికి నాణ్యమైన విధానం %-% రైతన్నకు నేస్తం( యథా బీజం %-% తథా సస్యం) పేరిట వానాకాలం 2025లో నాణ్యమైన వితనాలను పలువురు రైతులకు అందజేశారు. టీ ప్రైడ్ పథకం కింద 42 మంది ఎస్సీ, ఎస్టీ లబ్దిదారులకు 1 కోటి 85 లక్షల సబ్సిడీ మంజూరు పత్రాలు పంపిణీ చేశారు.

**శకటాల ప్రదర్శన**

రవాణా శాఖ, ఆర్టీసీ ఆద్వర్యంలో శకటాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల ఆద్వర్యంలో అందించే సేవలు, పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూపరెడ్డి వేములవాడ సిరిసిల్ల ఆర్డీవోలు రాధాబాయి వెంకటేశ్వర్లు, అడిషనల్ ఎస్పీ చంద్రయ్య డిఎస్పి చంద్రశేఖర్ రెడ్డి,సిరిసిల్ల తహసిల్దార్ మహేష్ కుమార్ మున్సిపల్ కమిషనర్లు వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విత్తనాలు రైతులకు అందించాలి..



**సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముశం రమేష్**

**బలగం టీవీ, సిరిసిల్ల**

రైతులు నకిలీ విత్తనాలు అమ్మకుండా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని,అధిక ధరలకు విత్తనాల అమ్ముతున్న వారిపై కేసులు పెట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ముశం రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సోమవారం సిరిసిల్ల పట్టణంలోని అమృత్యులాల శుక్ల కార్మిక భవనంలో ఏర్పాటు విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ము శం రమేష్ మాట్లాడుతూ ప్రస్తుతం వానకాలం సీజన్ ప్రారంభం అవుతున్న సందర్భంగా రైతులు పంటలు పండించేందుకు విత్తనాలు వేసే సీజన్ ప్రారంభం అవుతుందని అన్నారు.కాబట్టి వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించే విధంగా చర్యలు తీసుకోవాలని,నకిలీ విత్తనాల బారిన పడకుండా కాపాడాలని నకిలీ విత్తనాలు అమ్మే వారిపై పిడి యాక్టు.కేసులు బుక్ చేయాలని అన్నారు ప్రభుత్వ పంటలకు సరిపడే విత్తనాలు ఉత్పత్తి చేయకపోవడం వలన విత్తనాలు దొరకక రైతులు. కంపెనీ విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు దీని ఆసరా చేసుకుని,ప్రైవేట్ కార్పొరేట్ కంపెనీలు అధిక లాభాల కోసం నాణ్యతలు పాటించకుండా,పెద్ద మొత్తంలో విత్తనాలు ఉత్పత్తి చేస్తే వేల కోట రూపాయల వ్యాపారం నిర్వహిస్తున్నారని అన్నారు.

ప్రతి సంవత్సరం రైతులు నాణ్యత లేని నకిలీ విత్తనాల వలన తీవ్రంగా నష్టపోవడం జరుగుతుందని, పంటలు దిగుబడి రాక అప్పుల పాలై ఆత్మహత్య చేసుకున్న పరిస్థితి కొనసాగుతున్నదని అన్నారు. బీటీ 3 పత్తి విత్తనాలు నాణ్యమైన పత్తి,ఎక్కువ దిగుబడి వస్తుందని రైతులను మోసం చేస్తూ ఎక్కువ ధరలకు వ్యాపారాలు అమ్ముతున్నారని, ఇలాంటి వాటిపై వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి. దళారులు చేస్తున్న మోసాన్ని అరికట్టి,వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శు వర్గ సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి, కొడం రమణ, జిల్లా కమిటీ సభ్యులు సూరం పద్మ తదితరులు పాల్గొన్నారు

## గల్ఫ్ కార్మికులు తెలంగాణ అభివృద్ధికి మూలస్తంభాలు..

**-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, వేములవాడ**



ఉపాధి కోసం దేశం విడిచి వెళ్లిన గల్ఫ్ కార్మికులు తెలంగాణ అభివృద్ధికి మూలస్తంభాలని, వారి సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అంకితభావంతో పని చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ గల్ఫ్ సమితి మరియు ఇండియన్ కమ్యూనిటీ బెనోవేలెంట్ ఫోరం ఆధ్వర్యంలో ఖతార్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటులో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించిదని,అటు రాజకీయంగా నష్టపోయే పరిస్థితుల్లోనూ ఇచ్చిన మాటకు కట్టుబడి తెలంగాణ రాష్ట్రాన్ని సోనియా గాంధీ ఇచ్చిందని అన్నారు. తెలంగాణ సాధనలో ప్రతి వర్గం, ప్రతి సంఘం, ప్రతి యువజనులు, మహిళలు, కార్మికులు, కర్షకులు, విద్యార్థులు పోరాడతే తెలంగాణ వచ్చిందని,ఒక్క కుటుంబమే తెలంగాణ తెచ్చింది అనే తప్పుడు ప్రచారం చేసుకుంటాన్నారని అన్నారు.గత పదేళ్లలో “నీళ్లు, నిధులు, నియామకాలు” పేరిట ప్రజలను మోసగించినదని అన్నారు. గల్ఫ్ కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో గల్ఫ్ కార్మికుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నదని అన్నారు. ప్రభుత్వం గల్ఫ్ కార్మికుల పిల్లల విద్యకు ప్రాధాన్యత ఇస్తూ గురుకులాల్లో అవకాశాలు కల్పిస్తున్నారని అన్నారు.

వేములవాడ నియోజకవర్గంలో రూ. 200 కోట్ల వ్యయంతో 25 ఎకరాలలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రభుత్వం మంజూరు చేసిందని అన్నారు. వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభమవుతాయని, గత పదేళ్లలో ఎదురుచూసిన ఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మంజూరు చేస్తోందని అన్నారు.స్థలం ఉన్నవారికి తొలి విడతలో రూ. 5 లక్షలు,స్థలం లేనివారికి రెండో విడతలో స్థలంతో పాటు రూ. 5 లక్షల మంజూరు చేస్తామని అన్నారు.గల్ఫ్ కార్మికులు మరణిస్తే వారి కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తామని అన్నారు.గల్ఫ్ అడ్వైజర్ బోర్డును ఏర్పాటు చేసి, కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని అన్నారు. తెలంగాణ ప్రజాభవన్‌లో 24/7 గల్ఫ్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి, అవసరమైన వారికి సహాయం అందిస్తున్నామని అన్నారు.

# బౌలర్ల కోసం కొత్త రూల్..!

**బలగం టీవీ, హైదరాబాద్**




వన్డే క్రికెట్ లో కీలక మార్పులు చేసేందుకు ఐసీసీ రంగం సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. వన్డే క్రికెట్‌లో గత కొద్ది సంవత్సరాలుగా రెండు బాల్స్ నిబంధన అమలు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే, ఈ రూల్ బౌలర్లకు పెద్దగా అనుకూలంగా లేదని.. బ్యాటర్లకు ఉపకరిస్తుందనే విమర్శలున్నాయి. ఈ క్రమంలో కొత్త నిబంధనతో బౌలర్లకు ప్రయోజనం చేకూరనున్నట్లు తెలుస్తున్నది. ప్రస్తుత అమలులో ఉన్న నిబంధనల ప్రకారం ఒక వన్డే ఇన్నింగ్‌లో రెండు వేర్వేరు బాల్స్‌ను ఒక్కో ఎండ్ నుంచి 25 ఓవర్ల చొప్పున బౌలింగ్ వేస్తున్న విషయం తెలిసిందే. అయితే, క్రిక్ బజ్ నివేదిక ప్రకారం.. జులై నుంచి కొత్తగా ఈ కొత్త నిబంధన అమలులోకి రానున్నది. ఈ రూల్స్ ప్రకారం.. మ్యాచ్ ప్రారంభం నుంచి 34 ఓవర్‌కు రెండు బాల్స్‌ను ఉపయోగిస్తారు.ఒక్కో ఎండ్ నుంచి రెండో బాల్స్‌ని ఉపయోగిస్తారు. అయితే, 35వ ఓవర్ తర్వాత ఫీల్డింగ్ సైడ్ రెండు బాల్స్‌లో ఒకదాన్ని మాత్రమే ఎంచుకొని.. మిగతా ఓవర్ల వరకు అదే బాల్‌ను వినియోగించాల్సి ఉంటుంది. గతంలో రెండు బాల్స్ వాడటం వల్ల ఒక బంతి చాలా ఎక్కువగా పాతపడకపోవడం వల్ల రివర్స్ స్వింగ్ చాలా అరుదుగా లభిస్తుండేది. కానీ, 35వ ఓవర్‌లో ఒకే బాల్‌ను కొనసాగించడం వల్ల బంతి పాతపడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. దాంతో చివరి 10 ఓవర్లలో రివర్స్ సింగ్ లభించే అవకాశాలు మరింత పెరుగుతాయి. దాంతో బౌలర్లకు మరింత ప్రయోజనకరంగా ఉండనున్నది. వన్డేల్లో బ్యాట్స్‌మెన్ హవా ఎక్కువగా ఉందని.. బౌలర్లకు ఎలాంటి ప్రయోజనం లేదనే విమర్శలు వచ్చాయి. తాజాగా ఐసీసీ ఈ విధానం తీసుకురానున్నట్టు సమాచారం.



# ఎమర్జింగ్ ఆసియా కప్ వాయిదా

**బలగం టీవీ, హైదరాబాద్**

జూన్ 6 నుంచి శ్రీలంకలో జరగాల్సిన మహిళల టీ20 ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్ 2025 వాయిదా పడింది. ప్రతికూల వాతావరణం మరియు ఆరోగ్య పరిస్థితులు కారణంగా టోర్నీని వాయిదా వేస్తున్నట్లు ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) సోమవారం ప్రకటించింది. టోర్నీని వాయిదా వేయాలని ఆతిథ్య బోర్డు (శ్రీలంక) అధ్యక్షుడు షమ్మీ సిల్వా ఏసీసీకి లేఖ రాశాడు. ఈ లేఖను పరిగణలోకి తీసుకొని ఏసీసీ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం శ్రీలంకలో క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించేందుకు వాతావరణం అనుకూలంగా లేదని, ఆ ప్రాంతంలో చికున్‌గున్యా వ్యాప్తి చెందుతుందని సిల్వా తన లేఖలో పేర్కొన్నాడు. టోర్నీ తదుపరి షెడ్యూల్‌ను త్వరలో విడుదల చేస్తామని ఏసీసీ అధ్యక్షుడు మొహిసిన్ నఖ్వీ వెల్లడించాడు. షె డ్యూల్ ప్రకారం శ్రీలంక వేదికగా జూన్ 6 నుంచి టోర్నీ మొదలవ్వాల్సింది.

కాగా, ఏసీసీ మహిళల టీ20 ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్ 2023లో తొలిసారి జరిగింది. హాంగ్‌కాంగ్ వేదికగా నాడు జరిగిన టోర్నీలో భారత్ ఏ విజేతగా నిలిచింది. ఫైనల్లో భారత్ బంగ్లాదేశ్ ఏను 31 పరుగుల తేడాతో ఓడించి ఛాంపియన్‌గా నిలిచింది. ఈ టోర్నీలో భారత్, బంగ్లాదేశ్, పాకిస్తాన్, శ్రీలంక ఏ జట్లతో పాటు యూఏఈ, నేపాల్, థాయ్‌లాండ్, మలేసియా

# రాజేంద్రప్రసాద్ వ్యాఖ్యలపై స్పందించిన ఆలీ

**బలగం టీవీ, హైదరాబాద్**



ప్రముఖ సీనియర్ నటుడు రాజేంద్ర ప్రసాద్ ఓ కార్యక్రమంలో కమెడియన్ అలీని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమైన సంగతి తెలిసిందే.అయితే దీనిపై తాజాగా రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. నేను చేసిన కొన్ని వ్యాఖ్యలను కొందరు తప్పుగా అర్థం చేసుకున్నారని, తాను ఎప్పుడూ సరదాగా ఉండే వ్యక్తినని స్పష్టం చేశారు. నేను మాట్లాడిన మాటలని తప్పుగా అర్థం చేసుకోవడం మీ సంస్కారం మీద ఆధారపడి ఉంటుంది. వాటిని తప్పుగా అర్థం చేసుకోకుంటే అది మీ ఖర్మ. నేనైతే ఇలానే ఎప్పుడూ సరదాగానే ఉంటాను. మీడియాను నా కుటుంబంగా భావిస్తాను. నన్ను మీరంతా అన్నయ్య అని పిలవడం నా అదృష్టం అంటూ రాజేంద్రప్రసాద్ వివరణ ఇచ్చారు . మనం నటించే సినిమాల్లో మనం కనిపించకూడదు, పాత్రలే కనిపించాలి. నాతో పనిచేసిన నటీనటులంతా నాతో సరదాగానే ఉంటారు. అందులో తప్పేం లేదు అని ఆయన వివరించారు. అయితే ఈ వివాదంపై తాజాగా అలీ స్పందించారు. ఆయన కావాలని అలా మాట్లాడలేదని, అనుకోకుండా మాట తూలిందని తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక వీడియో విడుదల చేశారు. "ఎస్వీ కృష్ణారెడ్డి పుట్టినరోజు సందర్భంగా నిర్వహించిన ఈవెంట్ లో అనుకోకుండా రాజేంద్రప్రసాద్ కి మాట తూలింది. సరదాగా అన్న మాటలను మీడియా మిత్రులు వైరల్ చేస్తున్నారు. ఆయన మంచి ఆర్టిస్ట్. పుట్టెడు దుఃఖంలో ఉన్నారు. ఇటీవల కాలంలో ఆయన కూతురు పోయింది. అమ్మలాంటి బిడ్డ చనిపోవడంతో అలా అయిపోయారు. ఆయన కావాలని చెప్పింది కాదు. ఆయన పెద్దాయన. ప్లీజ్.. ఎవరూ దీన్ని పెద్దది చేయకండి' అన్నారు.

# అంతర్జాతీయ క్రికెట్‌కు క్లాసెన్ గుడ్‌బై

- 33 ఏండ్లకే రిటైర్‌మెంట్
- షాక్‌కు గురైన ప్రపంచ క్రికెట్ అభిమానులు
- కుటుంబం కోసమే : క్లాసెన్



**బలగం టీవీ, హైదరాబాద్**

సౌతాఫ్రికా స్టార్ క్రికెటర్ హెన్రిచ్ క్లాసెన్ షాకింగ్ నిర్ణయం తీసుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్‌మెంట్ ప్రకటించాడు.క్లాసెన్ ఒక్కసారిగా ఈ నిర్ణయం తీసుకోవడంతో సౌతాఫ్రికాలోనే కాదు.. ప్రపంచ క్రికెట్ అభిమానులు ఆశ్చర్యానికి గురయ్యారు. 33 ఏళ్ల వయసులోనే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. కాగా, క్లాసెన్ ఐపీఎల్‌లో హైదరాబాద్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దక్షిణాఫ్రికా జట్టుకు వికెట్ కీపర్, బ్యాటర్‌గా అతను ఆడాడు.

ఇటీవల ఏప్రిల్‌లో దక్షిణాఫ్రికా క్రికెట్.. అతన్ని సెంట్రల్ కాంట్రాక్టు నుంచి తప్పించింది. దీంతో అంతర్జాతీయ క్రికెట్ నుంచి దూరం కావాలన్న ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. 2024 జనవరిలో అతను టెస్టు క్రికెట్ నుంచి రిటైర్ అయ్యాడు. దక్షిణాఫ్రికా తరఫున నాలుగు టెస్టులు, 60 వన్డేలు, 58 టీ20 మ్యాచ్‌లు అతను ఆడాడు.అంతర్జాతీయ క్రికెట్ నుంచి తప్పుకోవాలని నిర్ణయించానని, ఇది తనకు విషాదకర దినమని క్లాసెన తన స్టేట్మెంట్‌లో పేర్కొన్నాడు. ఈ నిర్ణయం తీసుకునేందుకు తనకు చాలా సమయం పట్టిందన్నాడు. తన కుటుంబం గురించి ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిం దన్నాడు.

2018లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి ఆరంగేట్రం చేసిన క్లాసెన్ సౌతాఫ్రికా తరఫున 4 టెస్టులు, 60 వన్డేలు, 58 టి-20లు ఆడాడు. ఇందుల్లో వన్డేల్లో 4 సెంచరీలు, 16 అర్ధశతకాలతో 3245 పరుగులు చేశాడు. 2027లో సౌతాఫ్రికాలో వన్డే ప్రపంచకప్ జరగనుంది. అంతకు ముందే క్లాసెన్ రిటైర్‌మెంట్ ప్రకటించడం సఫారీ అభిమానులను తీవ్రంగా నిరాశపరించింది. టీ20 క్రికెట్‌లో క్లాసెన్ విధ్వంసకర బ్యాటర్‌గా గుర్తింపు తెచ్చుకున్నాడు.

# వన్డేలకు మాక్స్ వెల్ వీడ్కోలు



**బలగం టీవీ, హైదరాబాద్**

ఆస్ట్రేలియా స్టార్ క్రికెటర్ మాక్స్ వెల్ వన్డేలకు రిటైర్మెంట్ ప్రకటించాడు. అయితే టీ 20లకు అందుబాటులో ఉంటున్నట్లు ప్రకటించాడు. 'ఆటకు నా శరీరం పరిస్థితులకు తగ్గట్టు సహకరిస్తుందా లేదా అనేది చూసుకున్నా..అయితే నేను జట్టును కొంచెం నిరాశపరుస్తున్నట్లు అనిపించింది. (సెలెక్టర్ల ఛైర్మన్) జార్జ్ బెయిలీతో మాట్లాడి అతడితో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నా' అని ఓ పాడ్‌కాస్ట్‌తో అన్నాడు మాక్స్ వెల్ . . ఆస్ట్రేలియా తరపున అతను మొత్తం 149 వన్డేలు ఆడాడు. వచ్చే ఏడాది జరిగే టీ20 వరల్డ్‌కప్‌లో ఆడాలన్న ఆసక్తిని కూడా అతను వెల్లడించాడు.

2012 నుంచి 2025 వరకు తన కెరీర్ లో 149 వన్డేలు ఆడి 3990 పరుగులు చేసి 77 వికెట్లు పడగొట్టాడు. 2015 మరియు 2023లో ఆస్ట్రేలియా ప్రపంచ కప్ గెలిచిన జట్లలో కూడా అతను ఒకడు. వన్డేల్లో 4 సెంచరీలు, 23 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. 2025 ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో చివరి వన్డే మ్యాచ్ ఆడాడు.

# సెప్టెంబర్ 30 నుంచి మహిళల వరల్డ్ కప్.

**బలగం టీవీ, హైదరాబాద్**



మహిళల వన్డే వరల్డ్ కప్ షెడ్యూల్ విడుదలైంది. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ టోర్నీ సెప్టెంబర్ 30న మొదలు కానుంది. ఇరుదేశాల్లో మెగా టోర్నీ జరిపేందుకు ఐసీసీ సన్నాహకాలు చేపట్టిన ఐసీసీ సోమవారం షెడ్యూల్‌ను ప్రకటించింది. ఇరుదేశాల్లో ఐదు వేదికలపై 13వ ఎడిషన్ వరల్డ్ కప్ మ్యాచ్‌లు ఉంటాయని తెలిపింది. ఈసారి టైటిల్ కోసం ఎనిమిది జట్లు పోటీ పడుతున్నాయి. భారత్, శ్రీలంక, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లు తలపడనున్నాయి. సెప్టెంబర్ 30న జరుగబోయే ఆరంభ పోరులో బంగ్లాదేశ్‌తో భారత జట్టు తలపడనుంది. తొలి సెమీ ఫైనల్ అక్టోబర్ 29న గువాహటి లేదా కొలంబోలో, రెండో సెమీస్ అక్టోబర్ 30న బెంగళూరులో జరుగుతాయి. నవంబర్ 2 న ఫైనల్ జరగనుంది

# అక్టోబర్ 17న 'తెలుసు కదా'

**బలగం టీవీ, హైదరాబాద్**




సిద్ధు జొన్నలగడ్డ చేస్తున్న తాజా చిత్రం 'తెలుసు కదా'. రొమాంటిక్ లవ్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి నీరజ కోన దర్శకత్వం వహిస్తున్నారు. అయితే, గత కొన్ని రోజులుగా ఈ చిత్రం రిలీజ్ డేట్ కోసం ఎదురు చూస్తున్న ప్రేక్షకులకు మేకర్స్ తాజాగా క్లారిటీ ఇచ్చేశారు. ఈ మూవీని దీపావళి కానుకగా అక్టోబర్ 17న విడుదల చేస్తున్నామంటూ అధికారికంగా ప్రకటించారు. రొమాంటిక్ లవ్ స్టోరీగా రూపొందుతున్న ఈ సినిమా కోసం విడుదల చేసిన ప్రమోషనల్ వీడియో ఆకట్టుకుంటోంది.

# హరి హర వీరమల్లు' ట్రైలర్ విడుదలకాకపోవడంపై నిర్మాత వివరణ

**బలగం టీవీ, హైదరాబాద్**

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'హరి హర వీరమల్లు'. మొదటి భాగం జూన్ 12న విడుదల కానున్న విషయం తెలిసిందే. అయితే సినిమా ట్రైలర్ విడుదల గురించి నిర్మాత ఏఎం రత్నం స్పందించారు. "ఈ సినిమా ట్రైలర్ కోసం అభిమానులు చాలా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారన్న విషయం మాకు తెలుసు. అయితే, 'హరి హర వీరమల్లు' రెండో భాగంలో కంప్యూటర్ గ్రాఫిక్స్ (సీజీ) వర్క్ చాలా ఎక్కువగా ఉంది. దీనివల్ల కొంత ఆలస్యం అయింది. ప్రస్తుతం ఈ సీజీ పనులు చాలా వేగంగా జరుగుతున్నాయి. ఆ పనులు ఒక కొలిక్కి వచ్చిన తర్వాతే ట్రైలర్‌ను విడుదల చేస్తాం" అని తెలిపారు.

# పొజీషన్ లో ఉన్నా.. ఆపొజిషన్ లో ఉన్నా తెలంగాణే ఫస్ట్

(మొదటి పేజీ తరువాయి)

స్వప్నం చిగురించింది. తెలంగాణ ప్రజల పోరాటాలతోనే చరిత్ర సృష్టించబడింది. తెలుగువారికి రెండు రాష్ట్రాలు కాదు, మూడు రాష్ట్రాలు ఉన్నాయని టెక్సాస్ ను చూస్తే అనిపిస్తోంది. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సంబరాలను జరుపుకుందాం అనుకున్నప్పుడు తెలంగాణ ఎన్నారైలు ఏకగ్రీవంగా సూచించిన నగరం డల్లాస్. ఇవాళ నాకు అమెరికాలో ఉన్నట్టు అనిపించడం లేదు. వేలాదిగా తరలివచ్చిన మిమ్మల్ని, మీ ఉత్సాహాన్ని చూస్తుంటే హైదరాబాదులో ఉన్నట్టే అనిపిస్తుంది. తెలంగాణ ఏర్పడిన కొత్తలో 2015లో పెట్టుబడుల కోసం డల్లాస్ నగరానికి వచ్చాను. ఆనాడు ఆత్మవిశ్వాసంతో.. భవిష్యత్తు మీద నమ్మకంతో.. తెలంగాణ తరఫున కేసీఆర్ దూతలుగా మేము చెప్పిన మాటలు, చేసిన వాగ్దానాలు నెరవేర్చడంతో పాటు చెప్పనివి కూడా ఎన్నో చేసి చూపించినందుకు గర్వంగా అనిపిస్తుంది.

జీవితంలో కలలు చాలా మంది అంటారు. కానీ కొందరే సాకారం చేసుకుంటారు. ఒక విశ్వాసంతో, ఒక నమ్మకంతో, గుండె నిబ్బరంతో, తమ నమ్మకాన్ని పెట్టుబడిగా మలిచి స్వశక్తితో పైకి ఎదగడాన్ని చాలామంది అమెరికన్ డ్రీమ్ అంటారు. మీరు ఎలా అయితే ఒక స్వప్నాన్ని చూశారో 2001 సంవత్సరంలో ఒక బక్క పలచని మనిషి కూడా ఒక కల కన్నాడు. ఆ కల తన కోసం కాదు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల కోసం కన్నాడు. దేశ స్వాతంత్రం కోసం పోరాడిన మహాత్ముడి స్ఫూర్తితో%ఠా% బోధించు సమీకరించు పోరాడు అని చెప్పిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తిగా%ఠా% ఐ హేవ్ ఏ డ్రీమ్ అని గర్జించిన మార్టిన్ లూథర్ కింగ్ స్ఫూర్తిగా చిమ్మచీకట్లలో ఒకే ఒక్కడుగా బయలుదేరి ఉద్యమ బాట నుంచి తప్పుకుంటే రాళ్లతో కొట్టి చంపండి అని పిలుపునిచ్చిన ఒకే ఒక నాయకుడు కేసీఆర్%ఠా

%శూన్యం నుంచి సునామి సృష్టించి, తెలంగాణ మిషన్ ఇంపాజిబుల్ అన్న పరిస్థితి ని మిషన్ పాజిబుల్ అన్న పరిస్థితికి తెచ్చి ఢిల్లీ మెడలు వంచి తెలంగాణ తెచ్చిన నాయకుడు కేసీఆర్ గారు. ఆనాడు కెసిఆర్ పిలుపు మేరకు సకలజనులు ఏకమై అపూర్వ పోరాట సన్నివేశాలను ఆవిష్కరించి స్వరాష్ట్రాన్ని సాధించుకున్నారు.

అమెరికా గడ్డపై కూడా ఎన్నారైలు.. మాతృభూమి కోసం జై తెలంగాణ అని నినదించి తమ పోరాట స్ఫూర్తిని ఘనంగా చాటారు. కుట్రలను ఛేదించి, కుతంత్రాలను ఎదిరించి, అవమానాలను అధిగమించి అవరోధాలను కూకటి వేళ్ళతో పెకిలించి ఉద్యమ రథసారథి కేసీఆర్ గారి నాయకత్వంలో ఏదైతే ఈ సుదీర్ఘ ప్రయాణం జరిగిందో ఇది దేశ రాజకీయ చరిత్రలోనే అత్యంత కీలకమైన రాజకీయ అధ్యాయం.

మళ్లీ మూడేళ్లలో తిరిగి అధికారంలోకి వస్తాం.. తిరిగి కెసిఆర్ ముఖ్యమంత్రి అవుతారు. ఓవైపు తెలంగాణ పార్టీకి రజతోత్సవం, మరోవైపు తెలంగాణ రాష్ట్రానికి పుష్కర సంవత్సరం. గులాబీ జెండా 25 సంవత్సరాలు పూర్తి చేసుకుంటే రాష్ట్రం 12వ ఏట అడుగు పెట్టింది. 2001 ఏప్రిల్ 27 నాడు తెలంగాణ గర్వించే కొండా లక్ష్మణ్ బాపూజీ గారి జలదృశ్యంలో తెలంగాణ రాష్ట్ర సమితి పురుడు పోసుకుంది. తెలంగాణకు గుండె ధైర్యమైన గులాబీ జెండాకు పాతికేళ్లు నిండాయి. స్వీయ రాజకీయ అస్తిత్వానికి సిల్వర్ జూబ్లీ జరుగుతుంది. ఒక యోధుడు, ఒక వీరుడు వేసిన ఒక్క అడుగుతో జలదృశ్యంలో మొదలైన జర్నీ రెండున్నర దశాబ్దాల మైలురాయిని అందుకున్న అపురూప దృశ్యం ఆవిష్కృతమైంది. ఆత్మగౌరవ పోరాటాల వీర గాథల్లో శిథిలాల నుంచి శిఖరాన్ని చేరిన తెలంగాణ గెలుపు కథ తప్పకుండా సువర్ణాక్షరాలతో రాయబడుతుంది. ఇంత విలక్షణమైన, విశిష్టమైన ప్రయాణం, ప్రస్థానం ప్రపంచంలోని ఏ పార్టీకి ఉండదు. ఆటుపోట్లకు అదరలేదు. ఎదురుదెబ్బలకు బెదరలేదు. పని అయిపోయిందని ప్రచారం జరిగిన ప్రతిసారి బూడిదల నుంచి ఎగిరిన ఫీనిక్స్ పక్షి లాగా పైకి లేచి గమ్యాన్ని ముద్దాడింది కేసీఆర్ గారి నాయకత్వంలోని బీఆర్ఎస్.

ఎన్నారైలను చూసి తెలంగాణ తల్లి గర్విస్తుంది. – కేటీఆర్

ఏ దేశమేగినా.. ఏ పీటమెక్కినా.. పుట్టిన గడ్డ పేరు వినగానే ఎవరికైనా పులకింత కలుగుతుంది. ఇక్కడ డల్లాస్ లో జై తెలంగాణ అని అందరూ నినదించినప్పుడు గుండెలనిండా మన ఆత్మగౌరవం ఆకాశమే హద్దుగా ఉప్పొంగింది. మాతృభూమి మీద మమకారంతో ఈ కార్యక్రమానికి వేలాదిగా తరలివచ్చిన ప్రతి ఒక్కరికి వందనం. అందరికీ తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు. పదేళ్లపాటు ప్రభుత్వం లో ఉన్నప్పుడు దాన్ని బరువు లా భావించలేదు. బాధ్యతలా భావించాం. ఉద్యమ స్ఫూర్తితోనే ప్రభుత్వాన్ని నడిపినందుకు అనితర సాధ్యమైన ఎన్నో విజయాలు సొంతం అయ్యాయి. విడిపోతే విఫల రాష్ట్రం అవుతుందని హేళన చేసిన చోటనే విజయకేతనం ఎగరవేశాం.. మిమ్మల్ని పరిపాలించే నాయకులు ఉన్నారా అని గెలిచేసిన నోళ్ళతోనే మాకు కూడా మీలాంటి నాయకులు ఉంటే బాగుంటుందనిపించాం.

స్వరాష్ట్రాన్ని నంబర్ వన్ గా నిలపడంలో ఏ ఒక్క అవకాశాన్ని కూడా కేసీఆర్ గారి నాయకత్వంలో వదులుకోలేదు. మొన్నటి ఎన్నికల్లో ఓట్లల్లో వెనుకబడ్డాం కావచ్చు కానీ తెలంగాణను ప్రేమించడంలో ఎన్నటికీ వెనుకబడం. పొజిషన్ లో ఉన్నా అపోజిషన్ లో ఉన్నా కచ్చితంగా మాకు తెలంగాణ ఫస్ట్, ఇండియానే ఫస్ట్..అమెరికాలో వివిధ రంగాల్లో పనిచేస్తున్న ఎన్నారైలను చూసి తెలంగాణ తల్లి గర్విస్తుంది. తెలంగాణ మట్టి వాసనను మోసుకొచ్చి అగ్రరాజ్యంలో వెదజల్లుతున్న ప్రతిభావంతులు మీరు. ఖండాలను దాటి వచ్చి తెలంగాణ జెండాను రెపరెపలాడిస్తున్నది మీ నైపుణ్యం. మీ విజ్ఞానం మీ దక్షతకు వందనం.. తెలంగాణ రత్నాలు మీరు. భారతజాతి ముద్దుబిడ్డలు మీరు. తెలుగు తేజాలు మీరు. ఉద్యోగాల్లో%ఠా%వ్యాపారాల్లో%ఠా% పారిశ్రామిక రంగంలో మీ సత్తాను, సమర్థతను ప్రదర్శిస్తూ వేల మైళ్ల దూరంలో రాణిస్తూ భారత మాత ముద్దుబిడ్డలుగా తెలంగాణ తెలివికి ప్రతీకలుగా నిలుస్తున్న మీ అందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు.

నాటి ఉద్యమంలో అయినా.. పదేళ్ల ఉజ్వల ప్రయాణంలో అయినా తెలంగాణ ఎన్నారైలు పోషించిన పాత్ర అద్వితీయం.. తెలంగాణ చరిత్రలో ఎప్పటికీ సువర్ణ అక్షరాలతో మీ పాత్ర లిఖించబడి ఉంటుంది .ఇక్కడ కనిపిస్తున్న ఆడబిడ్డలు పుట్టిన గడ్డకు వేలాది మైళ్ల దూరంలో ఉన్నా ఏనాడు బతుకమ్మను మరిచిపోలేదు.. బతుకునిచ్చిన తెలంగాణ తల్లిని కూడా మర్చిపోలేదు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కంటికి రెప్పలా కాపాడుతూ పిల్లలకు భారతీయ సంస్కృతిని నేర్పిస్తున్న ఆడబిడ్డలందరికీ పేరుపేరునా హృదయపూర్వక వందనం.

కెసిఆర్ గారి 14 ఏళ్ల పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని మీ మీ వృత్తుల్లో రాణించండి. మీ ఉద్యోగాలు, వృత్తుల్లో ఉన్నత స్థానాలకు ఎదగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా.. ప్రతి అస్తిత్వం మనకు గర్వకారణమే. ఎన్నారై అంటే నాన్ రెసిడెంట్ ఇండియన్ కాదు.. నెసెసరీ రెసిడెంట్ ఆఫ్ ఇండియా. మాజీ ప్రధాని, తెలంగాణ ఠీవి పీవీ నరసింహారావు గారు భారత దేశ ముఖచిత్రాన్ని మార్చేశారు. ఆయన సేవలు చిరస్మరణీయం.

ఒకనాడు తెలంగాణ అనగానే కరువు, కన్నీళ్లు , ఆకలి చావులు, ఎన్కౌంటర్లు గుర్తొచ్చేవి. పడావుబడ్డ భూములు, పాడుబడ్డ బావులు, మొండి గోడలు, ఎండిపోయిన చెరువులు, బొంబాయి, దుబాయ్ , బొగ్గు బాయి లాంటి తెలంగాణ బతుకుల్ని ఒక దశాబ్ద కాలంలోనే కేసీఆర్ గారు సంపూర్ణంగా మార్చారు. సుజల సుఫల సస్యశ్యామల తెలంగాణను ఆవిష్కరింపచేశారు. వలవల ఏడుస్తూ వలస వెళ్లిపోయిన పాలమూరుకు వలపోతల నుంచి విముక్తి కల్పించారు. బొక్కలు వంగి బతుకులు కుంగిన నల్లగొండ గుండెల పైనుంచి ఫ్లోరైడ్ బండను శాశ్వతంగా తొలగించారు. సాలెల మగ్గం సడుగులు విరిగి ఉరిసిల్లగా మారిన సిరిసిల్ల నేతన్నలకు బీఆర్ఎస్ పాలనలో బతుకుపై భరోసా కల్పించారు. పిట్టల్లా రాలిపోయే విష జ్వరాల విషాదం నుంచి ఆదివాసీల బిడ్డలకు పదేళ్ల పాలనలో కొత్త జీవితాలను ప్రసాదించారు. కటిక చీకట్లతో, కరెంటు కోతలతో, కాలిన మోటర్లతో అల్లాడిపోయిన అంధకారం నుంచి వెలుగుల వైపు సాగిన తెలంగాణ ప్రయాణం దేశానికే స్ఫూర్తిదాయకం. నీళ్ళు లేక, బోర్ల మీద బోర్లు వేసి బొక్క బోర్లా పడి అప్పుల పాలై చేనుగట్ల కాడ శవాలుగా వేలాడిన అన్నదాతల ఆత్మహత్యల నివారణకు రైతుబంధు, రైతుభీమా వంటి ఎన్నో విప్లవాత్మక పథకాలతో దేశానికే దిక్సూచిగా నిలిచింది మన తెలంగాణ. మన బీఆర్ఎస్ ప్రభుత్వం.

" బొంబాయి దుబాయ్ బొగ్గు బాయి బతుకులను మార్చి రివర్స్ మైగ్రేషన్ కు తెలంగాణను వేదికగా మార్చిన ఘనత కేసీఆర్ పాలనకే దక్కిందన్నారు. ఈనాడు కనిపించే అద్భుతాలన్నీ ఒకప్పటి కేసీఆర్ గారి ఆలోచనలే. తెలంగాణ వస్తదా రాదా అని టీవీలలో, రాజకీయ సర్కిల్లో చర్చ జరుగుతుంటే .. తెలంగాణ వచ్చాక ఏం చేద్దాం అని ఆనాడే ఆలోచించిన దార్శనికుడు కేసీఆర్ గారు"

"కేసీఆర్ గారి కలలు, ఊహలు, ఆలోచనలు , కొంతమందికి అతిశయంగా అనిపించేవి. కానీ ప్రతి మనిషికి ఒక కల్పన ఉండాలి. భవిష్యత్తును ముందే ఊహించే ఆలోచనలు ఉండాలి. ఉద్యమ సందర్భంలోనే రేపటి తెలంగాణ రూపాన్ని కలర్ ఫుల్ గా కల్పన చేసిన విజనరీ కేసీఆర్. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే మిగులు రాష్ట్రం అవుతుంది. ధనిక రాష్ట్రం అవుతుందని ఉద్యమ సందర్భంలోనే బలంగా వాదించిన నాయకుడు కేసీఆర్. ఇవాళ ఆయన వాక్కు నిజమైంది. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో సిరిసంపదలతో తెలంగాణ విరాజిల్లింది. దేశం కడుపునింపే స్థాయికి ఎదిగింది.

ఆర్థిక సౌష్టవంతో, సౌభాగ్యంతో అలరారింది. లక్షల కోట్ల సంపదను సృష్టించింది. కొత్తగా ఏర్పడిన ఒక రాష్ట్రం, దేశాన్ని సాకే రాష్ట్రాలలో ఒకటిగా అవతరించిన వండర్ మన 10 ఏళ్ల పరిపాలనలోనే జరిగింది. 2.5% జనాభా ఉన్న తెలంగాణ వాటా దేశ జిడిపిలో ఐదు శాతంగా ఎదగడం ప్రతి తెలంగాణ బిడ్డకు గర్వకారణం. 2014లో తెలంగాణ జి ఎస్ డి పి నాలుగున్నర లక్షల కోట్లు అయితే మేం అధికారం నుంచి దిగిపోయే నాటికి 15 లక్షల కోట్లు. భారతదేశంలో ఏ రాష్ట్రం కూడా తెలంగాణ లాగా 238 శాతం పురోగతి సాధించలేదు.

2013 –14 లో తెలంగాణ తలసరి ఆదాయం కేవలం లక్ష 12 వేల రూపాయలు కానీ 2023లో మూడు లక్షల 56వేలు. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం 2015–16 లో తెలంగాణలో మల్టీ డైమెన్షనల్ పావర్టీ 13.18% అయితే 2023- 24 లో అది 3.76 శాతానికి తగ్గింది. కేవలం ఎనిమిదేళ్లలోనే 10 శాతం పేదరిక నిర్మూలన జరిగింది. తెలంగాణలో తప్ప ఇంకెక్కడ భారతదేశంలో ఇది జరగలేదు. శాస్త్రీయ అవగాహన, ఆర్థిక విజ్ఞానం లేని వాళ్ళు తెలివితక్కువ తనంతో అప్పుల మీద అబద్ధాలు ప్రచారం చేశారు. అప్పు చేసి తెలంగాణ పప్పుకూడు తినలేదు. అప్పుచేసి ఆర్థిక చక్రాన్ని తిప్పి ఆదాయాన్ని పోగుచేసి సంపద సృష్టించి రాష్ట్రంలోని పేదలకు పంచాము. తెలంగాణ ఆర్థిక క్రమశిక్షణ తప్పలేదు. మితిమీరి అప్పులు చేయలేదు.. కేంద్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం అప్పుల్లో తెలంగాణ ది 24 ర్యాంక్. బ్రహ్మాండమైన ఆర్థిక క్రమశిక్షణను మేం పాటించాం. చేయకూడని అప్పు చేయలేదు. చేయకూడని తప్పు చేయలేదు" అని అన్నారు.




## తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో "యువ కెరటాలు" కవి సమ్మేళనం..

బలగం టీవీ, హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ సారస్వత పరిషత్‌లో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో "యువ కెరటాలు" కవి సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత యువ కవులకు స్ఫూర్తినిచ్చే ప్రసంగం చేశారు. ఈ రోజు తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న రోజు అని గుర్తుచేసుకుంటూ, ఉద్యమ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. "చిన్న పిల్లలు బతుకమ్మ పాటలు నేర్చుకుంటే బతుకమ్మ వందేళ్లు బతికి ఉంటుంది. యువ కవులు కవితలు రాస్తే తెలంగాణ సాహిత్యం వందేళ్లు బతికి ఉంటుంది" అని కవిత అన్నారు. తెలంగాణ తల్లి రూపశిల్పి బీవీఆర్ చారి పుట్టినరోజు, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం ఒకే రోజు కావడం సంతోషకరమని ఆమె పేర్కొన్నారు. సాహిత్యం, సంస్కృతి వర్ధిల్లిన నేల బాగుంటుందని అభిప్రాయపడ్డారు. 35 ఏళ్ల లోపు వయసున్న యువ కవులు అన్ని భాషల్లో కవిత్వం రాయాలనే ఆకాంక్షతో ఈ కవి సమ్మేళనం నిర్వహించామని కవిత తెలిపారు. "తెలంగాణ బిడ్డలకు ధిక్కారం ఎలా ఉంటుందో మమకారం కూడా అంతే ఉంటుంది. కవులు ఏ పాలకుడి ముందు కూడా తలవంచకూడదు. పాలనలో లోపాలను ఎత్తి చూపాల్సిందే. నిజాన్ని నిర్భయంగా చెప్పేవాడే నిజమైన కవి" అని ఆమె స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమ కాలంలో యువత ఆత్మ బలిదానాలను కవులు తమ కవితల ద్వారా చెప్పేవారని గుర్తుచేస్తూ, భవిష్యత్ తెలంగాణ అభివృద్ధి కోసం మన నీళ్లు, వనరుల రక్షణపై కవిత్వం రావాలని పిలుపునిచ్చారు. కవులపై పెద్ద బాధ్యత ఉందని, సమాజాన్ని సరైన బాటలో నడిపేదే కవిత్వమని అన్నారు. తెలంగాణలో జాగృతి ఆధ్వర్యంలో ఎన్నో కార్యక్రమాలు చేయాల్సి ఉందని, అందుకు అందరి సహకారం కావాలని కవిత కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ రోజు ప్రారంభించ తలపెట్టిన యువ వికాసాన్ని రద్దు చేసుకుందని, అయితే ఆ పథకానికి తెలంగాణ అమర వీరుల పేర్లు పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదని కవిత విమర్శించారు. "నా పేరులోనే కవిత ఉన్నది. ఎవరు అధికారంలో ఉన్నా కవి ఆ పాలకులను ప్రశ్నిస్తూనే ఉండాలి. మా నాన్న అధికారంలో లేరు కాబట్టే నేను ఇలా చెప్తున్నానని అనుకోవద్దు" అని ఆమె అన్నారు. కేసీఆర్ గారు దిక్సూచిలా, దారి దీపంలా నిలబడి ఉద్యమ దిశ నిర్దేశం చేశారని, ఆయన పోరాటంతోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నామని కవిత ప్రసంగాన్ని ముగించారు.

## నాలాలపై హైడ్రాకు ఫిర్యాదులు...!

బలగం టీవి, హైదరాబాద్

నాలాల కబ్జాలపై హైడ్రాకు ఫిర్యాదులు వస్తున్నాయి. రాష్ట్ర అవతరణ దినోత్సవం ఉన్నా కూడా సోమవారం హైడ్రా ప్రజావాణికి 23 ఫిర్యాదులం దాయి. ఇందులో 70 శాతం నాలాల సమస్యలపైన ఫిర్యాదులందాయి. మిగతావి ఎప్పటిలాగే రహదా రులు, పార్కులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపైన ఉన్నాయి. సికింద్రాబాద్, తిరుమలగిరి, భూదేవి నగర్‌లోని సాయిదత్తా గార్డెన్స్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఉద్దేశించిన 225 గజాల స్థలం కబ్జా అయ్యిందని స్థానికులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. 2004లోనే జీహెచ్ ఎంసీకి ఆ స్థలాన్ని ఇచ్చి కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరినా.. ఫలితం లేకపోయిందని వాపోయారు. శేరిలింగం పల్లి మండలంలోని ఖానామెట్ విలేజ్‌లో 11/20, 11/21 సర్వే నంబర్లలో 1983లో గురుకుల ట్రస్టు లే ఔట్ వేశారు. అందులోని ప్లాట్లతో పాటు.. రహదారులు కబ్జాకు గురయ్యాయని స్థానికులు ఫిర్యాదుచేశారు. వర్షాకాలం కావడంతో నాలాల కబ్జాల ఫిర్యాదులపై ఎక్కువ దృష్టి పెట్టినా.. ఎప్పటిలాగే కొన్ని జనరల్ ఫిర్యాదులను కూడా తీసుకుంటోంది.

బేగంపేటలోని చికోటి గార్డెన్స్ ప్రాంతంలో నాలా కుంచించుకుపోవడంతో బృందావన్ అపార్టుమెంట్‌లోకి వరద నీరు వచ్చి చేరుతోంది. 2020 సంవత్సరంలో వరదలకు సెల్లార్ నీట మునిగింది ఇలా వర్షాకాలం వచ్చిందంటే ఇబ్బందిగా పరిణమిస్తోంది. ఇక్కడి నాలా పొంగి నివాస ప్రాంతాల్లోకి వరద నీరుచేరకుండా చూడాలని అపార్టుమెంటు నివాసితులు ఫిర్యాదు చేశారు. కూకట్‌పల్లి లోని రంగధాముని చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఆక్రమణలతో పాటు.. ఈ చెరువునుంచి ఐడీఎల్ చెరువుకు వెళ్లే నాలా కూడా కబ్జా జరిగిందని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో భారీ వర్షాలు కురిసినప్పుడు 7 కాలనీలకు వరద ముప్పు పొంచి ఉంటోందని వాపోయారు. వెంటనే ఆక్రమణలను తొలగించి వరద నీరు సాఫీగా వెళ్లేలా ఏర్పాట్లు చేయాలని కోరారు. హస్మత్‌పేట నాలా – పికెట్ నాలాలు కుంచించుకుపోవడంతో బేగంపేట పరిసరాల్లో పాయిగా కాలనీ, విమాన్ నగర్, బీహెచ్ ఈఎల్ కాలనీ, అవంతి కాలనీ, రసూల్‌పురా బస్తీ వరద నీటిలో చిక్కుకుంటున్నాయని స్థానికులు ఫిర్యాదుచేశారు. సైదాబాద్, బాలాజీనగర్‌లో మురుగు, వరద కాలువలు కబ్జాకు గురయ్యాయని బాలాజీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. ఓవైసీ ఆసుపత్రి వద్ద చెరువు నిండితే .. ఆ వరద ఆదర్శనగర్ మీదుగా సరూర్‌నగర్ చెరువుకు చేరాల్సి ఉండగా.. వరద కాలువ కుంచించుకుపోవడంతో బస్తీలు నీట మునుగుతున్నాయని పేర్కొన్నారు.

## భగవద్గీత 700 శ్లోకాలు కంఠస్థం చేసిన మహిళలకు సిరిసిల్ల గీతా ప్రచార సేవా సమితి ఘన సత్కారం..

బలగం టీవి, హైదరాబాద్

భగవద్గీతలోని 700 శ్లోకాలను కంఠస్థం చేసి అసాధారణ ప్రతిభను చాటుకున్న ఐదుగురు మహిళలను సిరిసిల్ల గీతా ప్రచార సేవా సమితి ఘనంగా సత్కరించింది. గీతాశ్రమంలో ఈరోజు (జూన్ 2) ఉదయం 11 గంటలకు కోడం నారాయణ అధ్యక్షతన, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జనపాల శంకరయ్య కార్యనిర్వహణలో ఈ సన్మాన కార్యక్రమం జరిగింది. మైసూర్‌లోని శ్రీ గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో నిర్వహించిన '700 శ్లోకాల కంఠస్థం' కార్యక్రమంలో బంగారు పతకాలు, శాలువాలతో సత్కారం పొందిన నార్ల సంతోషి, కటకం లక్ష్మి, కటకం విజయ, జి. సంగీత, జి. ప్రశస్తిలకు సిరిసిల్ల గీతా ప్రచార సేవా సమితి ప్రత్యేక అభినందనలు తెలియజేసింది. వీరిలో ముగ్గురు సిరిసిల్ల స్థానికులు కాగా, ఆవునూరుకు చెందిన ఇద్దరు (తల్లి, బిడ్డలు) ఒకే ఇంటివారు కావడం విశేషం.